# పేర్లేముండది పెద్దిర్కెం

''ఎంట ఏలెడంత పిల్లవుంటె ఏనిగె అంత బలం'' అన్నరు నేను గుడ నామన్మ రాలిని ఎంటవెట్టుకోని మాకమలమ్మ వొదినె వూరు గోపులాపురం బోయిన.

ఆవూరికి గోపులాపురం అంట పేరు గోపిరంగనె వెట్టిన్రు గని వచ్చిపోవుడుకె వల్లె అంత పొద్దు వడ్తది, అవూరుకి రైలులేదు. బస్సంటవుంటె, అది, వూరి సెర్వు కట్టావల వోకూత పెట్టు దూరాన దింపుతది. ఆడికెళ్లి ముల్లె మూట నెత్తిన వెట్టుకోని, ఆరెముల్లు, పరిక్కంప, వొంపు, వొడ్డు అనుకుంట సెర్వుకట్టెక్కి పైనిండ కండ్లువెట్టు కోని పొరజాసు కుంట నడ్సెట్యాళ్లకు పట్నం కెళ్లి మీది మోటారు మీద డిల్లి దాంక వోయి మళ్లి రావొచ్చు. అందికె ఆవూరి పయినం పేరు జెప్పంగనె కుంటి బిచ్చ ఆట యాది కొస్తది, వానకాలం గిట ఐతె అంత పొలం జేస్తరు, యాడ జూసిన కర్గెట,కర్గెట, ఇంగ ఎండకాలమైతె, బండెక్కి ఎన్కటికి ఎంకయ్య భూప్రదక్షిణం జేసినట్ల ఊరిసుట్టు దిర్గి పోవాలె.

అసొంటి గోపులాపురం బోయిన నేనూ, నామన్మరాలు బస్సు దిగి బాటపొంటి వెరిగిన వో గుంపు గున్న గున్నమామిడిసెట్లు కిందనిలవడ్డం. అక్కడిక్కడ జూస్తుంటె ఎన్కటోలె లేదు. ఆడ వో రొండు చాయె,దుకాండ్లు, రొండు మూడు రిషాలు బాట అవుతలి దిక్కు పాలెం కాడ వో దేవుని గుడి ఎల్సినట్ల గండ్లవడ్తుండది. రిషనన్నగట్టుకుం దమంట వో అడ్గు ముందలికేసి ఏవంట వల్కరిత్తు ? అంట తట పటాయించుకుంట, మా వోండ్లు దోలిన మనిషి చేరవచ్చు, కొంచెం వొడి వోపికె వడ్డం అంట మళ్ల ఆసెట్టు నీడల్నె నిలవడ్తిమి.

ఇంతట్లకె వోసోరపిలగాడు పట్నోనుగిన దొడ్గి ఇస్కూటరెక్కి రయిఁవంట వోకుంట మమ్ముల జూసి సట్కున ఆపి 'యావూరమ్మ ? యాడ్కివోవాలె ? అంట అడ్గె. ఆవమాటిన్న నేను, యాడ్కిలేదు నాయిన, ఈడ్కెవొచ్చిన, రాచోరిరాంరెడ్డి వాండ్ల యింటికి వోవాలె. రాంరెడ్డి పెండ్లాం మా ఆడివిల్ల, వాండ్లు దోలిన మనిషి ఇంగారాలేదు,

ఏం ఏశమో ? ఏంకతనో ? అనెట్యాళ్లకు ఆపేరు ఇనంగనె ఆపిల్లగాడు బిసదిప్పినట్ల సెంగున ఇస్కూటరు మీదంగ దుంకినట్ల దిగి, ఎంతో భయం భక్తుల తోటి-

అమ్మా! ఆయిల్లు ఈసుట్టూ నాల్గూళ్లకు పేరువోయిన ఇల్లు, యాడున్నమంది అంత ఆ పేరినంగనె ఆదిక్కుదిర్గి దండం బెట్టుకుంటరు, ఎందరెందరు ఆవుప్పు దిన్నరు ? ఎన్నెన్ని ఇండ్లకు ఆమానుభావుడు దీపెంబెట్టి నిలవెట్టిండు. అసొంటి పుణ్యాత్ముడు ఇంగవుట్టడు, కాలానికి అందరు వొక్కటె . సిన్న, పెద్ద, రాజు ప్యాద, బక్కోడు బల్సినోడంట లేదు అంట చెప్పుకపోతుంటే

ఇదేం? మాటినవడ్తిని ? ఎంతపుట్టి మున్గె ? నాబిడ్డతానికెల్లి సక్కన ఈడి కొస్తి, తోవల్నె గద, మళ్ల ఇంటికివోతె గవిండ్లవడ్డట్లె, ఇల్లు ఇడిస్తె పిల్ల గర్సె నంట కదులు డైతాది ? శాన్నాళ్లాయె, ఆడివిల్లను వల్కరిచ్చి పోతనంటొచ్చి పిడుగు పాటసొంటి మాట ఇంటి.ఎట్లారానేవొస్తి. 'రోట్ల నెత్తి వెట్టి రోకండ్లకు బెదిర్తె ఎట్ల ? అంట అన్ని సంగతులు తాత్పర్యంగ దెల్సుకుంటనని కండ్లొత్తుకుంట ముక్కుజీదుకుంట ఆ ఇస్కూటరు పిల గాడు మాట్లాడిన రిక్ష ఎక్కికూసుంటి. ఎంటదెచ్చిన చిన్నసందుక ఆపిలగాడు ఇస్కూటరు ఎన్కకు దగిలిచ్చు కోని బాటవట్టె.

సెర్వు కట్టకాడ్కి రాంగనె మావొండ్ల దోలిన మనిషి ఎదురై ''రిచ్చుబాలయ్యన్న, మన పటేలింటికేనా? జరఆగవట్టు, నేను వాండ్లకోసమె వస్తుండకింద మీదవడుకుంట, అంట అంటుంటె నాకు ఎత ఆగక, అన్నో! అంట ఏడ్వవడ్తి, అదిజూసి ఆమనిషిడింగ్గై అమ్మ! ఎందుకేడుస్తుండరు ? మనోండ్లంత బాగేనా? అంట నన్నడ్గవట్టె, నేను జర త మాయించుకోని ''అన్నకు ఎకాఎకిన ఏమాయె ? ఎట్లవాయె ? అంట అంటుంటె ఆయన ! అయ్యోతల్లి; నీకుజెప్పినోళ్లెవరొగని ? పురాగ దెల్వనిగడ బిడమణుసులు ! కాలంజేసిన గాంరెడ్డి రాజోరి రాంరెడ్డి, ఏటవతల కెళ్లొచ్చి పడవంటి మొకాన రొండంత్రాల భవంతి గట్టు కున్నాయిన, మన పటేలుకేమైంది ? వుక్కుకడ్డోలెవుండడు. ఇప్పుడే కల్లం కాడికొచ్చి బంతి గట్టి కుప్పవోసిన కాకె రొడ్లకు ముద్దెర్లేసి ఇంటిమొకం బట్టి నన్ను నీకాడికి దరిమిండు '' అంట జెప్పుక పోతుండంగ, ఈ నీలివార్త మోసిన ఇస్కూటరు పిలగాడు ఎన్కకు మళ్లి మమ్ముల జేరొచ్చి, కత ఇని, మొకం దీపంతోలెగాంగ అమ్మ! ఇనికిడి దోషం తోటి ఇంతవుట్టింది, ఆమాట ఇనేది ఇనంగనె గుండెతల్లడిల్లంగ ఇస్కూటరేస్కోని వొచ్చి తోవల మీరు గండ్ల వడ్తె ఆసిచ్చు మీకు వెట్టిన. తెల్వక చేసిన

తప్పు మన్నిచ్చుండి. యాదో గండముండిన్నది. ఈ ఉత్తపుకారుతోటి తీర్తది పదుండి అంటుంటె,

నాగుండె మీది నల్లబండ తొలిగిచ్చినట్ల గాంగ, కొంగుతోటి మొకం దుడ్సుకోని, ఎంటికలు సవరిచ్చుకోని, దబ్బునవాఅయ్య, అంట రిషాయినను తొందురవెట్టి నామన్మ రాల్ని దగ్గెరికి గుంజుకోని కూసుంటి.

ఉత్తమనిషిని మట్కోరిషాల ఉండగని, మనుసు పరిపరి విధాల యాడ్కోడ్కో పోవట్టె, వుల్లి గడ్డ బుడ్డోడు వూరంత దిర్గి వున్న కాడ్కెవొచ్చెనంట, నా మనుసు భూప్రపంచికం అంత కలెజూసి మళ్ల పేరుకాడ్కె వొస్తది. మనిషి అంట వుట్టినంక యదొవోపేరు వెట్టకుంటె ఎట్ల ? పేరు లేకుంటె ఎవరు ? ఎవరని ? ఎట్లని విలుస్తరు ? గుర్తువడ్తరు, అందికె 'నాకేం బొడ్డుగోసి పేరువెట్టినవా? మర్యాద మన్నన లేకుండా పేరు వెట్టి పిలుస్తవ్'' అంటరు.

ఈ పేర్లు శనారకాలు; కొన్ని దేవుతలు, దేవుండ్ల పేర్లైతె ఇంగకొన్ని పెద్ద పెద్ద అర్దాలు వొచ్చెటట్లవుంటవి. మరిన్నేమొ సెవులకు తీనె రాగ మోలె, ఇనిపిచ్చెటట్ల వుంటయి,గని దాని అర్తం జూస్తె యాకొసకు ముడివడదు,ఇంగ కొన్ని గార్వానికి విల్సు కునె పేర్లైతె, మరికొన్ని గమ్మతుగ తట్టేసుకున్నట్ల గురిజూసి గుర్తువట్టేపేర్లుంటయి. అవి, ఇవి గాకుండ కొంతమంది పెట్టిపుట్టిన పుణ్యాత్ములు యావన్న మంచి పనులు జేస్తె ఆ పేర్లున్న కేవులం మణుసుల నుండి యీ గొప్ప బుద్దులను ఏరుజేసుకుంట వాట్లల్ల గానొచ్చె అపురూపురమైన గుణాన్నో, ముక్కు, సెవ్వు అసొంటి ఇంద్రియాన్నో వట్టు కోని పేరు ముందు జోడిచ్చి పిల్సుకుంటరు.

మనండ్ల పుట్టిన పిల్లలకు పురుడు జేసి పురుట్లనె పుట్కమనకుండ బత్కితె ఇరువై యెక్కదినం నాడు పేర్లు వెట్టుడు అలువాటు. ఈ పేరు వెట్టెనాడు తొల్తనె పెట్ట వల్సిన పేరు వెట్టరు. రామ, కృష్ణ, గోపాల,శివ, ఎంకటేశ అంట దేవుండ్ల పేరు వెట్టి అటెంక వీరప్రతాప, రాజేంద్ర,విద్యానాథ, సురేశ అనీ, ఆడివిల్లలైతె, సులోచన, సుశీల, శశికళఅనో పెట్టుకుంటరు, ఈపేర్లుకు అర్తం దీసుకుంట గూసుంటె వుత్త దండుగ,ఈవీరప్రతాపం, పగటిపూటనె దొంతులెన్క ఎల్కను జూస్తె జడ్సుక సావొచ్చు, ఇంగ విద్యానాదయ్య, విద్యకు జట ఇచ్చి విధ్య అంట వొత్తిపలుకొచ్చు, అట్లె మన సులోచనమ్మ సేపిరికండ్ల సిమ్మక్కగావొచ్చు, సుశీలమ్మ గయ్యాలిగంప, శశికళమాడ్పు

మూతి పిడ్క-మొకం గావొచ్చు, అందికె యాతంటాలు లేకుండ పిల్లలకు దేవుండ్ల పేరు వెట్టుకుంటె వాండ్లను విల్సుకున్నప్పుడన్న రామ, కృష్ణ అన్న ఫలందక్కుత దంట ఎన్కటోళ్లు పేర్లు వెట్టుకుంటుండిరి.

ఇంగ ఈ పిల్లలు సిన్నగున్నప్పుడు తలిదండ్రి, తాత అవ్వలు; ముద్దుకు తీరొక్క పేరువెట్టుకోని, చిన్నోడు, చిల్క, కొండి, బుజ్జి, లడ్డు, మిట్టు, అంట ఎన్నెన్నొపేర్ల విల్సు కుంటరు. ఇంగోటి పిల్లలు వుట్టి బత్కక పుట్నా పెట్ట అయ్యేటోళ్లు అన్నిటికన్న కొరగాని పేరు వెడ్తె ఆయీ కాలిదువ్మె బత్కి బట్టగడ్తరని, ఇస్తారి, పెంటయ్య, పెంటమ్మ, బోడయ్య, పుల్లయ్య, పుల్లమ్మ అంట వెట్టుకుంటరు.

అందికె శనామంది అంటుంటరు పేర్లేముండది పెద్దిర్కం, యారాయి ఐతేంది పండ్లూడ గొట్టుకోనికె అన్నట్ల యాపేరైతేంది? పిల్సుకోనికె అంట ఆపేర్లకు వో పెద్ద విలువ గట్టుక వో మనిషిని ఆ పేరువెట్టి 'కో' అంట విలుస్తే 'వో' అంట వల్కటందుకు ఏర్పడ్డ గుర్తోలెదీసుకుంటరు. ఇంగ ఇప్పటి కాలపు పేర్లు సెప్పుతరంగాదు. సబ్బండ నదీ జలాలు గల్సి కండ్ల కద్దుకునె తీర్తమైనట్ల అన్ని బాసల సదువులు అబ్బంగ నాగరీకం బెర్గి కొత్త ఇత్తునంగల్సిన కత్తెర పూతోలె తీరొక్క పేర్లు. పింకి, చింటి, చిట్కు, టింకు, చోటు, చీటు, బంటి, టీను, టిల్లు, డాలి, లల్లు, అంట విలుస్తుండురు. ఇవి మురివెంగ విల్సు కునె ముద్దుల పేర్లనుకోండి.

కొంత మందికి తలిదండ్రి నెట్టిన అసలు పేర్లు ఆడ్గునవడంగ నడుమంత్రాన వుట్టిన పేర్లు గట్టివారి రూఢికెక్కి నిలుస్తవి,. ఇందుట్ల కీర్తివి, అపకీర్తివి, రొండు కలె గల్పుగ ఉంటవి. సామెతకోసం, శివదాసు, అన్నయ్య, తాయయ్య, అమ్మ, పంటరు, పులి, అన్నదాత అనేవి, ఈ పేరకు వయిసుతోటి సంవందం వుండదు . ఏవయిసోండ్లనైనా ఏకా లాన్నైన అమణిషి అందరికి తాతయ్యనె, ఆమె అమ్మనె ఆయిన పులే ఇంగనేను జెప్పుడెందుకు? సదువుకున్నోళ్లకు దెలుస్తది. మన బారతకవులకు నన్నయ్య, తిక్కన, ఎర్రన అనేపేర్లు గాకుండ ఏందో శబ్దశాసనయ్య, కవిబ్రహ్మయ్య, శంభుదాసయ్య అంట పేరు వోయిన్రు. ఇంగ మన తెనాలిరామకృష్ణయ్య 'వికటకవి' అంట పేరెక్క లేదా ? ఏంది ? ఇంగోటి ఒగవూర్ల 'తిమ్మరెడ్డి ' అనే పేరుతోటి ఇద్దరు న్నప్పుడు, యా తిమ్మరెడ్డి ? అంట గుర్తు వట్టుకోవద్దా? అందికె ఈ ఇద్దట్ల కొట్టొచ్చెటట్ల కండ్లవడె గుణ ఇశేషోన్నో ? రూపు రేకనో వుంటె అది ములుసూపంగ దాన్ని పేరుకు ముందు

జోడిస్తరు, మచ్చుకు 'కర్రెతిమ్మరెడ్డి' మీసాలపోతరాజు, ఏక్తారునాగప్ప నాట్కాల బాల మణి, మిద్దెఇంటి ముసలమ్మ, పుట్నాలకిష్టమ్మ - అంట వున్న పేర్లు జెప్పకోవచ్చు.

ఈపేర్ల ముచ్చెట రాంగనె నాకు బిడ్డ దొర్సాని దాని దోస్తులు గల్సి పేర్లు వెట్టకంల జూపిన కరామత్ యాదికొచ్చి నగొస్తది. మాపిల్లను పోతుటీగె జొర్ర వీలు లేని కట్టు దిట్ట మున్న బోరిడింగులేశినం గని ఇంగో పోరగాండ్ల అన్నలు, బావలు, మామలు, అప్పుడో ఇప్పుడో రాక పోతారు? ఇంగ ఈపిల్లల మీద నిగురానికంట వో నడీడు మనిషిని ఏర్పాటు జేసిండ్రు. ఆమె పిల్లలను మంచి కాయిదలనె వెట్టింది. యాపండుగ పబ్బమైనా పలారా లన్ని జేపిచ్చి పెట్టేది. గని ఆతల్లికి వో తమ్ముడంటవుండెనంటె . అదేం? గాచారమొగని పాపం ఆ తమ్మయ్య పండుగ నాడు రాక మొకవాటానికో ఏందో ? పండుగ తెల్లారి వాలా యించి అక్కను సూడొచ్చేటోడంట. అక్కామె పలారాలన్ని వొడ్డిచ్చేదంట . లేకపోతె పొట్లంగట్టి ఇస్తుండె నంట ఇది జూసి పోరలంతగల్సి ఆయినకు 'పండుగ తెల్లారి' అంట పేరువెట్టిన్రు.

ఇదొక్కటేన ? ఆడి పోరగాండ్ల ఆగడం ? పాపం వాళ్ల బోర్డింగులుండె వో పిల్ల అన్నకు మెడసన్నగ పొడూగ వుంటుండెనంట, ఆయిన రాంగనె 'బకయంత్రం ' వొచ్చెను అంట మాట్లాడుకుంటుండిరంట. ఇట్లనె మా పోరి మ్యాన బావకు జెర వుబ్బు సెంపలుండవి, అదిదొర్క వట్టుకోని ఆపిలగాణి జోలివొచ్చినప్పుడల్ల 'కుందేలు సెంప ' అంట సంకేతం బెట్టుకున్నరంట ఇట్లనె 'గిర్దావరి' పాలడబ్బ బేబి అంట ఎన్నో మారు పేర్లు వెట్టుకోని ఎవ్వరికి దొర్కకుండ రాజ మార్గంగ దిర్గుతుంటి మంట గప్పాలు గొట్టంగ ఇన్న.

ఇట్ల పేర్ల ముచ్చెటవట్టుకోని ఎన్ని పందిళ్లన్న అల్లుకోవచ్చుగని నాపేరేందంటె 'పెసరుగింజ' అంట పరాశ్కం గాకుండ, ఆ పేరుకు వో బిగువూ బింకెం కూడవెట్టాలె అందికె వాడ్కంల ఆయిన'' పేరెన్నికైన మనిషి'' ఆయిన '' పేరువోయిండు''. అనేవి కీర్తికి మారుపేర్లై నిలవడ్డవి. ఇంట్ల ఒక్కడు గుణవంతుడు వుడ్తె ఆ ఇంటి గోత్రానికే పేరొస్తది, గుణం లేని దుర్మార్గపోడు వుడ్తె కులానికంత రొంపి వూస్తడు.

ఈనాటికీ మనం ఇంటుండం గద, ఎన్కటికి గొడగూచి తండ్రి కంచి ఏడువాడల తోటి తనెంట సొర్గం బొందితోన గొంచ వోయిండని? ఇదేం? సిన్న సన్నమాటన అందికె పేరు పెద్దిర్క? మంట వడిసస్తం.

''అందని మాని పండు పుల్లన అంట నాకెందు కు పేరు గీరంట పాకులాట'' అంట అనొచ్చు, గని 'పేరు' అంతవుత్త పున్యానికి దొర్కదు. దానికి పూర్వజన్మ పుణ్ణెం ఈజన్మల నీవు జేసిన మంచి రొండు జోడైతెనె దొర్కుతది అనుకుంట. అదే మా రామన్నను జూడ రాదుండి, ఎంత పేరు దెచ్చుకున్నడు అంట అనుకుంట వుండంగ 'రిచ్చ' మా ఆడివిల్ల పాలోండ్ల ఇండ్ల కాడికొచ్చె.

నన్ను జూసేది సూడంగనె పిల్లలు పెద్దలు జనం అంత గుంపులోలె జుట్టుకోని, ఈ ఎన్నముద్ద ఎవరమ్మ! సిల్కతల్లిబిడ్డన! అంట జవుర్క సంకలేస్కోని, ముద్దెమాసె మల్లె పువ్వంట ఇంట్లకు దోల్కపోయిరి, ఆడ పెద్దర్యాజల మా ఆడివిల్ల నిలవడి రావమ్మ వొదినె అంట పరాశ్కాలాడుకుంట ఇంట్లకు బాటజూపె!

ఇంతమంది మనుసులల్ల సోటు జేస్కున్న మారామన్నను జూస్తె నాకు చిత్రమని పిచ్చింది. ఏందో పేరులేని బత్కు ఏం బత్కు కాకి బత్కు ?- గద్ద వెయ్యేండ్లు బత్కు తది ఏం లాభం! పేరెన్నికైన బత్కు! తనమనోండ్లకు అక్కరకొచ్చిన బత్కే బత్కు. అనుకోని మా ఆడివిల్లను గట్టిగ అల్మకోని ముద్దిచ్చుకున్న. అమె ఎదనిండంగ కండ్లొత్తుకోని! ఏందమ్మ వొదినె! నీకు ఏండ్లు మీదవడ్డగని సిన్నపిల్ల శాష్టలు వోలేదు. ఏం ? యాది కొచ్చెనమ్మ ? అంటుంటె!

నేను ఆమెను జూసుకుంట కములమ్మ నీవు అంశవంతురాలవు. అన్నసొంటి మొగుడు దొరికిండు అంట అంటుంటె ! ఆమె ఆమాట పూర్తిగాకతొలిగనె, నీకన్న అంశమంతు లెవరుంటరమ్మ? రూపుకు మారురూపు జేసెసృష్టి కర్త అసొంటి చిత్తారి చక్రవర్తిని గట్టుకున్నవు - అపేరు ముందల బిరుదులకే బుగులైతది అంట మారు బాణమేసె-

''అవును పేర్లనే పెద్దిర్కం వుంటది. అదిగాపాడుకోవాలె అంట అనుకుంట ముచ్చెట్లదండలు గుచ్చినం.